ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

వివేకానందనగర్‌కాలనీ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గం మాదాపూర్ డివిజన్ పరిధిలోని సుభాష్ చంద్రబోస్‌నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న అభయాంజనేయ ఆలయ నిర్మాణానికి లక్ష రూపాయల చెక్కును ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సప్తగిరికాలనీలోని తన నివాసంలో ఆలయ కమిటీ సభ్యులకు బుధవారం అందజేశారు. ఆలయ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంకారావు, నర్సింహ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కృష్ణారావుకు సమస్యలను విన్నవిస్తున్న తులసీనగర్‌వాసులు

దోమల బారి నుంచి ప్రజలకు రక్షణ కల్పించండి

అల్లాపూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ తులసినగర్‌లో దోమల బెడద తీవ్రంగా ఉందని స్థానికుల ఫిర్యాదు మేరకు తులసీనగర్, గాయత్రి నగర్, వివేకానందనగర్, లక్ష్మీనగర్‌లలో దోమల నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన గాయత్రినగర్‌లోని 'రాక్ గార్డెన్' సున్నం చెరువు వాకర్స్ పార్క్ సుందరీకరణ పనులను కార్పొరేటర్ సబీహ గౌసుద్దీన్‌తో కలిసి పర్యవేక్షించారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు లింగాల ఐలయ్య, జీహెచ్ఎంసీ అధికారులు ఈఈ సత్యనారాయణ, ఏఈ రంజిత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ బలరాం, జలమండలి లైన్‌మన్ మొగులయ్య, వీరారెడ్డి, పల్లి తిరుపతి, నాగుల సత్యం, సంజివ రెడ్డి, కొండల్‌రెడ్డి, నూర్, జావీదుద్దీన్ పాల్గొన్నారు.



ర్యాలీలో మాట్లాడుతున్న లక్ష్మణ్

కార్మిక చట్టాలను కాపాడుకోవాలి

షాపూర్‌నగర్, జూలై 10(ఆంధ్రజ్యోతి): పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను ఐక్యంగా ఉండి కాపాడుకోవాలని సీఐటీయూ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. డిమాండ్స్ డే సందర్భంగా జీడిమెట్ల పారిశ్రామికవాడ, షాపూర్‌నగర్ మెయిన్‌రోడ్డు, రైతుబజార్ నుంచి సాగర్ హోటల్ వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ కార్మికవ్యతిరేక విధానాలను నిరసిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్, వెంకన్న, దేవదానంలు మాట్లాడుతూ.. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కాలరాస్తూ, కార్మికులను బానిసలుగా మార్చే కుట్ర చేస్తోందన్నారు. కనీస వేతనాలు అమలు చేయకుండా ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌లో వంటి సౌకర్యాలను తగ్గిస్తుందన్నారు. కార్యక్రమంలో వెంకయ్య, ప్రసాద్, శ్రీను, తిమ్మప్ప, కరుణాకర్, దుర్గానాయక్, భాషా, ఏసు, శ్రీశైలం పాల్గొన్నారు.

రేపు కేఎం పాండు మెమోరియల్ కాలేజీలో జాబ్‌మేళా

దుండిగల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బహదూర్‌పల్లిలోని కేఎం పాండు మెమోరియల్ ప్రభుత్వ వృత్తివిద్య కాలేజీలో ఈనెల 12వ తేదీ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అప్రెంటిస్‌షిప్ జాబ్ మేళా ఏర్పాటు చేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ షేక్ మైమూన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో 20 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ఇంటర్మీడియట్ విద్యాధికారి కిషన్ మాట్లాడుతూ.. ఈ జాబ్‌మేళాకు సంబంధించిన కో-ఆర్డినేషన్ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య, మేడ్చల్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ హిమాయత్‌ల్లా, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీపురాన్ని సందర్శించిన కార్పొరేటర్

ఫతేనగర్, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ డివిజన్ పరిధి ఇందిరాగాంధీపురంలో కార్పొరేటర్ సతీష్‌గౌడ్ బుధవారం సందర్శించారు. స్థానికంగా ఉన్న బస్తీ దవాఖానాలో పేదలకు అందుతున్న వైద్య సేవలను ఆయన పరిశీలించారు. అనంతరం దవాఖానాపై రూ. 40 లక్షల వ్యయంతో చేపట్టిన మొదటి అంతస్తు నిర్మాణ పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సతీష్‌గౌడ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కృష్ణారావు సహకారంతో చేపట్టిన భవన నిర్మాణం పూర్తయితే ఉర్దు, తెలుగు మీడియం విద్యార్థులకు వేర్వేరుగా విద్యాబోధన చేసే వీలుందన్నారు.



కబీర్‌నగర్‌లో యూజీడీ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మహేందర్

యూజీడీ పనులను ప్రారంభించిన కార్పొరేటర్

కూకట్‌పల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మూసాపేట డివిజన్ పరిధి కబీర్‌నగర్‌లో రూ.8 లక్షల వ్యయంతో చేపట్టనున్న యూజీడీ పైపులైను పనులు కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ బుధవారం ప్రారంభించారు. పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పైపులైను పనులు పూర్తి చేస్తే కాలనీలో డ్రైనేజీ సమస్యకు పరిష్కారం లభిస్తుందని కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ ప్రకాష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శివ, కాలనీవాసులు జోసఫ్, నాయకులు మల్లేష్, ఎర్రస్వామి, భాస్కర్, సతీష్‌చారి, రమేష్, బసవరాజు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఆశా వర్కర్లు

డిమాండ్లను నెరవేర్చాలని ఆశా వర్కర్ల నిరసన

కేపీహెచ్‌బీకాలనీ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): న్యాయమైన ఆశా వర్కర్ల డిమాండ్లను నెరవేర్చాలని సీఐటీయూ కూకట్‌పల్లి మండలాధ్యక్షుడు కృష్ణానాయక్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్‌హెచ్‌ఎం స్కీమ్‌ను రక్షించాలని, ఆశాలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.26వేలు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని బుధవారం కోర్కెల దినం నిరసన కార్యక్రమంలో ఆశా వర్కర్లతో కలిసి కేపీహెచ్‌బీలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ స్వామికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సువర్ణ, శ్రీలత, విజయ, సరోజిని, అశ్విని తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్

ఆదర్శనగర్‌లో సీసీ రోడ్డు పరిశీలన

గచ్చిబౌలి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి డివిజన్ ఆదర్శనగర్‌లో చేపడుతున్న సీసీరోడ్డు పనులను కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో అన్ని ప్రాంతాల్లో ఇప్పటికే సీసీరోడ్లు నిర్మించినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ప్రాంతాల్లో కూడా సీసీరోడ్లు పూర్తి చేస్తామన్నారు. ఆదర్శనగర్‌లో సమస్యలు తీర్చిదిద్దేందుకు ప్రయత్నం చేస్తున్నామని అధికారులు ఎంతగానో సహకరిస్తున్నారని తెలిపారు. చెత్తచెదారం ఆరుబయట వేయ్యవద్దని సూచించారు.

గోల్డెన్ జూబ్లీ.. ప్రారంభానికి ముహూర్తం ఫిక్స్!

- జేఎన్‌టీయూలో రూ.36 కోట్లతో భవన నిర్మాణం
- 13న ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- ఏర్పాట్లపై వర్సిటీ డైరెక్టర్లతో ఇన్‌చార్జి వీసీ సమీక్ష



జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వీసీ బుర్రా వెంకటేశం

హైదరాబాద్ సిటీ, జూలై 10(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో రూ.36 కోట్లతో నిర్మించిన గోల్డెన్ జూబిలీ భవనం ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. ఈనెల 13న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నూతన భవనాన్ని ప్రారంభిస్తారని జేఎన్‌టీయూ డైరెక్టర్లతో జరిగిన సమావేశంలో ఇన్‌చార్జి వీసీ బుర్రా వెంకటేశం బుధవారం వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రారంభోత్సవం ఏర్పాట్ల పర్యవేక్షణకు అవసరమైన కమిటీలను ఏర్పాటు చేయాలని రిజిస్ట్రార్‌కు సూచించినట్లు తెలిపారు. గోల్డెన్ జూబ్లీ భవనం ప్రారంభోత్సవం తర్వాత జేఎన్‌టీయూ ఆడిటోరియంలో ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్య ప్రతినిధులతో, ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో, పోలీసు ఉన్నతాధికారులతో సీఎం వేర్వేరుగా సమావేశం అవుతారన్నారు. సీఎం పాల్గొనే కార్యక్రమాలన్నీ విజయవంతం అయ్యేలా పని చేయాలని వివిధ విభాగాల డైరెక్టర్లను, డిప్యూటీ డైరెక్టర్లను వీసీ ఆదేశించారు.

● కోర్ బ్రాంచ్‌లు లేకుంటే కష్టాలే..

ఇంజనీరింగ్ అంటే కంప్యూటర్ సైన్స్ ఒక్కటే కాదని కోర్ బ్రాంచ్‌లు లేకుంటే భవిష్యత్‌లో ఎన్నో కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఇన్‌చార్జి వీసీ బుర్రా వెంకటేశం అన్నారు. ఇంజనీరింగ్ కాలేజీల్లో కోర్ బ్రాంచ్‌లను మూసేయడం వలన భవిష్యత్‌లో భవన నిర్మాణం, ఆటోమొబైల్ రంగాల్లో పని చేసేందుకు సివిల్, మెకానికల్ ఇంజనీర్ల కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు. కోర్ బ్రాంచ్‌ల కొనసాగించేందుకు వీలుగా ఇంజనీరింగ్ కాలేజీలకు, విద్యార్థులకు ఆమోదయోగ్యంగా ఉండేలా సీఎం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్నారు. సీఎంతో జరిగే సమావేశానికి జేఎన్‌టీయూ పరిధిలోని 214 ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ కళాశాలల నుంచి కళాశాలకు ఐదుగురు చొప్పున (ప్రిన్సిపాల్, హెచ్ఓడీ, ప్రొఫెసర్లు) హాజరయ్యేలా చూడాలని రిజిస్ట్రార్‌కు సూచించారు.

● మరింత మెరుగ్గా ఎన్ఎస్ఎస్

విశ్వవిద్యాలయంలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని భావిస్తున్నట్లు వీసీ చెప్పారు. విద్యార్థులకు ట్రాఫిక్ అవేర్‌నెస్ కల్పించి నగరంలోని పలు కూడళ్లలో సేవలందించేందుకు వలంటీర్లను నియమించాలని వర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం సమన్వయకర్త శోభారాణికి సూచించారు. అలాగే, నగరంలోని వివిధ కాలనీలు, బస్తీల్లో చిన్నారులు లైంగిక వేధింపులకు గురికాకుండా వారికి తగు సూచనలు చేసే బాధ్యతను కూడా ఎన్ఎస్ఎస్ మహిళా వలంటీర్లకు అప్పగించాలన్నారు. స్పై కెమెరాలు లేని దుకాణాలకు 'నో కెమెరా జోన్' గా పేర్కొంటూ స్టిక్కర్లు అతికించడం వలన మహిళలకు కొంత మేరకు భద్రత కల్పించినట్లవుతుందన్నారు.

స్కూల్లో బుక్స్ అమ్ముతున్నారని ధర్నా

బాలానగర్, జూలై 10(ఆంధ్రజ్యోతి): బాలానగర్ డివిజన్ పరిధి ఫిరోజ్‌గూడలో ఉన్న సదాశివ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్ ముందు ఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం ధర్నా చేపట్టారు. స్కూల్లో అధిక ధరలకు యూనిఫాం, బెల్టులు, పుస్తకాలు ఇతర స్టేషనరీ విక్రయిస్తూ తల్లిదండ్రుల నడ్డి విరుస్తున్నారని ఆరోపిస్తూ సదాశివ స్కూల్ అనుమతిని వెంటనే రద్దు చేయాలని విద్యాశాఖను వారు డిమాండ్ చేశారు. స్కూల్లో బుక్స్ అమ్ముతున్నట్లు తేలడంతో మండల విద్యాధికారి కార్యాలయం నుంచి వచ్చిన సీఆర్‌పీ స్టేషనరి ఉన్న గదిని సీజ్ చేశారన్నారు. ధర్నాలో సుబ్బు, అరుణ్, విష్ణు, భూపతి, గౌతమ్, గిరి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో నోట్‌బుక్స్ పంపిణీ

కేపీహెచ్‌బీకాలనీ: సేవ్ ఏ లైఫ్ సేఫ్టీఫర్ హ్యూమానిటీ సంస్థ వ్యవస్థాపకులు సూరగాన రాణాప్రతాప్ ఆధ్వర్యంలో బుధవారం కేపీహెచ్‌బీ నాలుగోఫేజ్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలు సాయం చేయడానికి ముందుకు వచ్చి పేద విద్యార్థులు బాగా చదువుకునేందుకు అవసరమైన విద్యా సామగ్రిని అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్తయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్టోబర్ 6న గ్రేస్ కేన్సర్ రన్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

హైదరాబాద్ సిటీ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కేన్సర్‌ను జయించడానికి కలిసికట్టుగా పని చేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి అన్నారు. కేన్సర్‌ను ముందుగా గుర్తించడంతో కేన్సర్‌ను జయించే మార్గమన్నారు. ఈ ఏడాది అక్టోబర్ 6న జరగనున్న గ్రేస్ (గ్లోబల్ రీసెర్చ్ అండ్ కేన్సర్ ఎడ్యుకేషన్) కేన్సర్ రన్-24 కార్యక్రమానికి సంబంధించి బుధవారం గచ్చిబౌలిలో జరిగిన కర్టెయిన్ రైయిజర్ ఈవెంట్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మహంతి కర్టెయిన్ రెయిజ్ ద్వారా రేస్ జరిగే తేదీ, థీమ్, పోస్టర్ల విడుదల, రిజిస్ట్రేషన్లకు శ్రీకారం చుట్టారు. అవగాహన ద్వారా కేన్సర్ ముప్పు నుంచి జనాన్ని రక్షించవచ్చని మహంతి అన్నారు. గ్రేస్ ఫౌండేషన్ సీనియర్ కన్సల్టెంట్ చిన్నబాబు సుంకవల్లి మాట్లాడుతూ... అక్టోబర్ 6న గచ్చిబౌలి స్టేడియంలో 2కే వాక్, 5కే ఫన్‌రన్, 10కే (టైమ్డ్ రన్) కేటగిరీల్లో రేస్ ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకోవాలనుకున్న వారు (డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.గ్రేస్‌కేన్సర్‌రన్.కామ్) ద్వారా రిజిస్టర్ చేసుకోవాలి. కేన్సర్ రన్‌లో ఫిజికల్, వర్చువల్ మాధ్యమాల ద్వారా 130 దేశాల నుంచి లక్ష మందికి పైగా హాజరవుతారని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా అతి పెద్ద కేన్సర్ అవగాహన కార్యక్రమమని నిర్వాహకులైన గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ ప్రతినిధులు వివరించారు. ఇప్పటి వరకు గ్రేస్ ఫౌండేషన్ ద్వారా గతేడాది ముందస్తు స్కానింగ్ ద్వారా 40వేల మందిని రక్షించగలిగామన్నారు. రన్ ద్వారా సేకరించే నిధుల సాయంతో ఈ ఏడాది లక్షమందికి ముందస్తు స్క్రీనింగ్ లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కేన్సర్ రన్ కోసం హెచ్‌వైఎ ఎఈఏ, ఎస్‌సీఎస్‌సీలతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు సహకారం అందిస్తున్నాయన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి



టీజీఎస్‌పీడీసీఎల్ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

దుండిగల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): బాచుపల్లి పరిసర ప్రాంతాల్లో ఆటంకం లేని 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరాను అందించాలని టీజీఎస్‌పీడీసీఎల్ చైర్మన్‌ను కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. టీజీఎస్‌పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో చైర్మన్ ముషారఫ్ అలీ ఫారూకీ అలీని ఎమ్మెల్యే కలిసి సమస్యలు వివరించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అభివృద్ధి పనుల్లో ఆటంకం కలిగిస్తున్న విద్యుత్ మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తి చేసే విధంగా చూడాలన్నారు. బాచుపల్లి, మల్లంపేట్, బౌరంపేట్ మార్గంలో చేపడుతున్న హెచ్ఎండీఏ రోడ్డు విస్తరణ పనుల్లో ఆటంకంగా ఉన్న విద్యుత్ పోల్స్ వైర్ల తరలింపు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చెయ్యాలన్నారు. బహదూర్‌పల్లి, కొంపల్లి రోడ్డు విస్తరణ పనుల్లో విద్యుత్ లైన్‌ల తరలింపు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

● కుత్బుల్లాపూర్: పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ మొక్కలు నాటాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. వనమహోత్సవంలో భాగంగా బుధవారం కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మొక్కలు నాటారు.

● ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

జీడిమెట్ల: ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నానని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. బుధవారం సుభాష్‌నగర్ డివిజన్ పాండుబస్తీలో పాదయాత్ర చేశారు. స్థానికులు సీసీ రోడ్లు నిర్మించాలని కోరారు. వర్షాకాలంలో నీటి వరద నీటి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జి.సురేష్‌రెడ్డి, గుబ్బల లక్ష్మీనారాయణ, దూదిమెట్ల సోమేష్‌యాదవ్, పోలే శ్రీకాంత్ పుప్పాల భాస్కర్ పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డిని కలిసిన సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్



కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న చందర్ రావు, పీకే సింగ్ రాథోడ్, విజయ్‌బాబు

ఓల్డుబోయినపల్లి, జూలై 10(ఆంధ్రజోతి): కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అసోసియేషన్ అధ్యక్షుడు దండంరాజు రాంచందర్ రావు ఆధ్వర్యంలో అఖిల భారత పెన్షన్ అసోసియేషన్ ఉద్యోగుల కన్వీనర్ పికె సింగ్ రాథోడ్‌తో కలిసి పెండింగ్‌లో ఉన్న సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ పెన్షన్‌ను పెంచాలని మంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కోశాధికారి మేడూరి విజయబాబు రాంచందర్ వెంట ఉన్నారు.

చెత్తతో దోమలు.. నిర్లక్ష్యంతో రోగాలు



రోడ్డు పక్కన వేసిన చెత్త

షాపూర్‌నగర్, జూలై 10(ఆంధ్రజ్యోతి): సూరారం డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో, బస్తీల్లో పారిశుద్యం అస్తవ్యస్తంగా మారటంతో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడతారని ఆందోళన చెందుతున్నారు. డివిజన్‌లో సంజయ్‌గాంధీనగర్, కళావతి నగర్, మార్కేండేయ నగర్, నెహ్రూనగర్, రాజీవ్‌గాంధీనగర్, హనుమాన్‌నగర్ వంటి ప్రాంతాల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త పేరుకుపోవడంతో వర్షానికి కుళ్లి విపరీతమైన దుర్వాసన వెదజల్లుతోందన్నారు. వర్షాకాలంలో విపరీతంగా పెరిగిన దోమలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అధికారులు స్పందించి ఫాగింగ్ చేసి దోమల నివారణకు చెత్తపై క్రిమిసంహారకాలు పిచ్‌కారి చేసి, ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాలని కోరారు.

మల్లారెడ్డి 'అగ్రి' వర్సిటీలో విద్యార్థి ఆత్మహత్యాయత్నం

- వసతిగృహం పై నుంచి దూకిన బీఎస్సీ స్టూడెంట్
- విద్యుత్ తీగలపై పడడంతో తీవ్రగాయాలు

పేట్‌బషీరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఓ విద్యార్థి ఆత్మహత్యకు యత్నించాడు. పురుగుల మందు తాగి వసతి గృహం భవనం పై నుంచి కిందకు దూకాడు. విద్యుత్ తీగలపై పడడంతో తీవ్రమైన గాయాలయ్యాయి. పేట్‌బషీరాబాద్ సీఐ విజయవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన రామారావు కుమారుడు శెట్టిపెల్లి హరినాథ్(26) మేడ్చల్ జిల్లా మైసమ్మగూడలో మల్లారెడ్డి అగ్రికల్చరల్ యూనివర్సిటీలో మూడో సంవత్సరం బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సు చదువుతూ సాయిబాలాజీ వసతి గృహంలో ఉంటున్నాడు. మూడు రోజులుగా యూనివర్సిటీకి వెళ్లడం లేదు. మంగళవారం హైదరాబాద్‌లో ఉంటున్న అక్క వద్దకు వెళ్లివచ్చాడు. బుధవారం తోటి విద్యార్థులు కళాశాలకు వెళ్లగా మధ్యాహ్న సమయంలో పురుగుల మందు తాగిన హరినాథ్ వసతిగృహం 5వ అంతస్తు పై నుంచి దూకాడు. పక్కనే ఉన్న విద్యుత్ తీగలపై పడడంతో తీవ్రమైన గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వసతిగృహం నిర్వాహకులు తల్లిదండ్రులు, పోలీసులకు సమాచారం అందించారు. 108 సహాయంతో అతడిని కొంపల్లిలో శ్రీకర్ ఆస్పత్రికి తరలించారు. పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ కాలనీలో వనమహోత్సవం

మియాపూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): హఫీజ్‌పేట డివిజన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీలో నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో కార్పొరేటర్ పూజితతో కలిసి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ పాల్గొని స్థానికులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు.

● పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

భెల్‌కాలనీ: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, పర్యావరణాన్ని కాపాడితేనే ఆరోగ్యంగా ఉంటామని భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి పేర్కొన్నారు. వన మహోత్సవం సందర్భంగా డివిజన్ కార్యాలయ ఆవరణలో కాలనీవాసులతో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకం, సంరక్షణపై అవగాహన కల్పిస్తూ వారిచే మొక్కలు నాటించాలని సూచించారు.

పేకాట స్థావరంపై దాడి

పేట్‌బషీరాబాద్, జూలై 10(ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.71 వేలా 6 వందలా 70 రూపాయలు, ఆరు సెల్‌ఫోన్‌లు, ప్లేయింగ్ కార్డ్ సెట్‌ను స్వాధీనం చేసుకున్నారు. పేట్‌బషీరాబాద్ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చింతల్, రామ్‌రెడ్డినగర్‌కు చెందిన టి.ఉమేష్, ఉప్పల్ చిలుకానగర్‌కు చెందిన ఎండీ సీరజ్, షాపూర్‌నగర్‌కు చెందిన మనోజ్‌కుమార్, మలక్‌పేటకు చెందిన సురేష్, మియాపూర్‌కు చెందిన రాజేష్‌కుమార్, న్యూ బోయినపల్లికి చెందిన హరిరామ్‌సింగ్‌లు సుభాష్‌నగర్‌లోని ఫ్యాన్స్ తయారీ పరిశ్రమలో మంగళవారం రాత్రి పేకాట ఆడుతున్నారు. సమాచారం అందు కున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు పరిశ్రమపై దాడి చేసి, వీరి అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.



పార్కులో స్థానికులతో మాట్లాడుతున్న జగదీశ్వర్‌గౌడ్

పార్కు అభివృద్ధికి కృషి చేస్తాం

హైదర్‌నగర్: హైదర్‌నగర్ డివిజన్ అడ్డగుట్ట సొసైటీ, వెస్టర్న్ హిల్స్‌వాసుల కోరిక మేరకు శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ బుధవారం కాలనీలో పర్యటించారు. పార్కులో సమస్యలపై స్థానికులతో మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుంచి పార్కు నిరాదరణకు గురైందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన జగదీశ్వర్‌గౌడ్ డిప్యూటీ కమిషనర్‌కు ఫోన్‌చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. రేపటి నుంచే పనులు చేపడతామని అధికారులు ఆయనకు తెలిపారు.

మైనార్టీ గురుకుల హాస్టల్‌లో నీటి సమస్యను పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న ప్రజాసంఘాల నాయకులు

మియాపూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ గురుకుల హాస్టల్‌లో నీటి సమస్యను పరిష్కరించాలని బుధవారం మియాపూర్ డివిజన్ మయూరినగర్‌లో ఉన్న హెచ్ఎండబ్ల్యూఎస్ హఫీజ్‌పేట సెక్షన్ మేనేజర్ పూర్ణేశ్వరిని ప్రజా సంఘాల నాయకులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. గోకుల్‌ప్లాట్స్‌లో ఉన్న పాఠశాలలో 400 మంది పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకుంటున్నారని, రోజు వారి అవసరాలకు నీరు సరిపోక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మైనార్టీ గురుకుల హాస్టల్‌లో నీటి సమస్యను పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పల్లె మురళీ, నాయకులు సుల్తానాబేగం, ఇస్లావత్ దశరథ్ నాయక్, లావణ్య, రజియాబేగం పాల్గొన్నారు.

రాజధాని ఆర్టీసీ బస్సులో భారీ చోరీ

తూప్రాన్ దాబా వద్ద రూ.5 లక్షలు అపహరణ

తూప్రాన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాజధాని ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులో ప్రయాణిస్తున్న వ్యాపారి వద్ద ఐదు లక్షల నగదు చోరీకి గురయింది. ఈ సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ శివారులో హైవే బైపాస్‌లో దాబా హోటల్ వద్ద మంగళవారం రాత్రి జరిగింది. తూప్రాన్ ఎస్ఐ శివానందం వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి. హైదరాబాద్ కొంపెల్లికి చెందిన అమీన్‌అబ్దుల్ లాలని మసాల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. నిజామాబాద్ పట్టణానికి చెందిన ఇమ్రాన్ వద్ద మసాల సరఫరా డబ్బులు తీసుకురావడానికి మంగళవారం నిజామాబాద్‌కు అమీన్ అబ్దుల్ లాలని వెళ్లాడు. రూ.5 లక్షలు తీసుకొని కాలేజీ బ్యాగ్‌లో పెట్టుకొని నిజామాబాద్ నుంచి కొంపెల్లికి రాజధాని ఎక్స్‌ప్రెస్ ఆర్టీసీ బస్సులో బయల్దేరాడు. రాత్రి తూప్రాన్ పట్టణ శివారులోని హైవే బైపాస్‌లోని వినోద్ దాబా హోటల్ వద్ద బస్సు ఆగింది. డబ్బులున్న బ్యాగ్ సీటులో పెట్టి భోజనం చేసేందుకు కిందిదిగాడు. భోజనం చేసి బస్సులోకి వచ్చి చూడగా రూ.5 లక్షల నగదున్న బ్యాగ్ కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినప్పటికీ బ్యాగ్ ఆచూకీ లభించలేదు. బుధవారం తూప్రాన్ పోలీసుస్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ శివానందం వివరించారు.

రోడ్లపై ఆక్రమణలను తొలగించాలి: జడ్‌సీ

గచ్చిబౌలి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు చేసినా, వ్యాపారాలు చేసినా వెంటనే తొలగించాలని జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం శేరిలింగంపల్లి, చందానగర్ సర్కిళ్ల పరిధిలో విస్తృతంగా పర్యటించారు. జేఎన్టీయూ నుంచి హైటెక్‌సిటీ, అప్పై జోనల్ కార్యాలయం వరకు ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. పలు రోడ్డు ఆక్రమణలకు గురైనట్లు గుర్తించి వాటిని తొలగించాలని ఆదేశించారు. ఎన్ కన్వెన్షన్ ప్రాంతంలో ఆక్రమణలు వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు లేకుండా వెంటనే ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. ఎన్ కన్వెన్షన్ నుంచి స్మాల్ డెంటల్ ఆస్పత్రి వరకు వెంటనే మార్కింగ్ చేపట్టాలని ఆదేశించారు. విస్తరణ సమయంలో తొలగించాల్సిన చెట్లను ఇతర ప్రాంతాలకు తరలించాలన్నారు. చందానగర్ ఉపకమిషనర్ వంశీకృష్ణ, ఎస్ఈ శంకర్, ఈఈ రాజు, ఏసీపీ, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

● పారిశుధ్య నిర్వహణలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని జడ్‌సీ ఉపేందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. చెత్త, వ్యర్థాలు నిల్వఉండకుండా వెంటనే తొలగించాలని ఆదేశించారు. పారిశుధ్య అధికారులతో కలిసి బయోడైవర్సిటీ, కొత్తగూడ చౌరస్తా, మసీద్‌బండ, కొండాపూర్, హైటెక్‌సిటీ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. రోడ్డు పక్కన చెత్తాచెదారం కనిపించడంతో అధికారులను మందలించారు. కొత్తగూడ సర్కిల్‌లో ఏఎంబీమాల్ రోడ్డులో చెత్తను తొలగించాలన్నారు.



ఎన్ కన్వెన్షన్ వద్ద రోడ్డును పరిశీలిస్తున్న జడ్‌సీ ఉపేందర్‌రెడ్డి

● సమస్యలను పరిష్కరించాలని వినతి

నల్లగండ్ల హుడాకాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బుధవారం సంక్షేమసంఘం సభ్యులు కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి జడ్‌సీని కలిసి వినతి పత్రం అందజేశారు. కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి నానక్‌రాంగూడ, గోపన్‌పల్లి భూగర్భ డ్రైనేజీ, మంచినీటి, విద్యుత్ సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఖాజాగూడ పార్కు స్థలంలో ఓపెన్‌జిమ్, చిల్డ్రన్స్ పార్కును అభివృద్ధి చేయాలని జడ్‌సీని కోరారు.